## క్లుప్తంగా

### వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : నగరంలోని సంక్షేమ వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ కడప నగర కార్యదర్శి కె.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలలో సరైన వసతులు లేవన్నారు. విష పురుగులు, దోమలతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు అనేక రకాల జబ్బులతో, జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. తక్షణమే విద్యార్థుల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కె. శివశంకర్, నగర ఉపాధ్యక్షులు అకిరా నందన్, మస్తాన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అలసత్వం లేకుండా 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీకి సంబంధించిన బకాయిలను, పెండింగ్ లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పీఆర్సీ ప్రక్రియను ఐఆర్‌తో మొదలు పెట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

### అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన విద్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈఏపీసెట్–2024 ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)కు సంబంధించి వివిధ విభాగాల్లో వంద శాతం సీట్లు భర్తీ జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో వంద శాతం, సీఎస్‌సీ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లర్నింగ్) విభాగంలో వంద శాతం, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో వంద శాతం, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలలో 90 శాతం సీట్లు భర్తీ అయ్యాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డితో కలిసి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థపై నమ్మకంతో చేరిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తమ కళాశాలలో క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో సీటు వచ్చిన ప్రతి విద్యార్థి ఈనెల 22వ తేదీలోగా రిపోర్టు చేయాలని, వివరాలకు 9603999591, 7386324079 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### న్యాయవాది వృత్తి పవిత్రమైనది



న్యాయవాదులను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : న్యాయవాది వృత్తి పవిత్రమైనదని కడప చార్టెడ్ అకౌంటెంట్ బ్రాంచ్ మాజీ చైర్మన్ ఆడిటర్ సి.ఏ.కె ఖాజా హుస్సేన్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు అన్నారు. బుధవారం కడప ట్రంక్ రోడ్‌లోని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సీనియర్ న్యాయవాదులు డాక్టర్ ప్రభాకర్ జాల, బి.ఎస్ అక్బర్ అలీ ఖాన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డెక్కన్ డ్రైవింగ్ స్కూల్ అధినేత సయ్యద్ కలీం బుఖారి, సొసైటీ సభ్యులు సిద్దిక్ అలీ అహ్మద్, సయ్యద్ సుల్తాన్ సలావుద్దీన్, సంఘ సేవకులు ఎస్ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు

పెండ్లిమర్రి : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మస్తాన్‌స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. రవి ఉదయించిన రాజ్యమున శ్రీసంఘమేశ్వరుని పాదాన, పాపాఘ్నినది తీరాన అనేక కళలకు నిలయమై తెలుగు మెడలో మంచి ముత్యంలా మెరిసే కొండూరు గ్రామంలో దాదాపు శతాబ్దాల కాలంలో మస్తాన్ స్వామి వెలిశాడని అక్కడి పురాణాలు చెబుతున్నాయి. భూత పిశాచాలు ఉన్న వారికి అన్ని దృష్ట శక్తులను తొలగిస్తాడని అక్కడి భక్తుల నమ్మకం. ఈ ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం స్వామివారికి అలయ ఆవరణలో గుండము, మధ్యాహ్నం గంధము, రాత్రికి స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రెండవ రోజున స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# లలిత కళా వికాసం

ఊహకందని భావాలను ఆవిష్కరించే నైపుణ్యం.. మదిలో మెదిలే ఆలోచనలకు వర్ణరూపం ఇస్తూ.. తమ కుంచెలతో ప్రకృతి అందాలు మొదలు.. భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం.. వాటి పర్యవసానాలను తెలియజేసేలా చిత్రాలు గీస్తున్నారు.. మనసుకు హత్తుకునేలా.. మానవత్వం చాటిచెప్పేలా.. సమాజానికి సందేశమిచ్చేలా.. సృజనకు పదునుపెడుతూ తమ చిత్రాలతో వైవీయూ ఖ్యాతిని చాటిచెబుతున్నారు లలితకళల విభాగం విద్యార్థులు.. చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిన ఈ కోర్సులో ప్రవేశాలు పొందే అవకాశం విద్యార్థుల ముంగిట చేరింది.



వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు రూపొందించిన శిల్పాలు

- కళలకు కాణాచిగా నిలుస్తున్న వైవీయూ ఫైన్ ఆర్ట్స్
- చిత్రకళలో రాణిస్తున్న విద్యార్థులు

వైవీయూ : చిత్రలేఖనంలో రాణించాలనుకునే వారికి యోగివేమన విశ్వవిద్యాలయంలోని ఫైన్‌ఆర్ట్స్ విభాగం వేదికగా నిలుస్తోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలతో పాటు అభిరుచులకు ప్రాధాన్యత ఇస్తూ పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ యోగివేమన విశ్వవిద్యాలయంలో అందుబాటులోకి రావడంతో ఇక్కడి కళాకారులకు ఊతమిస్తోంది. ఆసక్తి, అభిరుచి కలిగిన విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శనం చేస్తుండటంతో చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు.

■ 2010లో యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన ఈ కోర్సులో ఎందరో విద్యార్థులు బీఎఫ్ఏ పూర్తిచేశారు. కోర్సు పూర్తి చేసుకున్నవారంతా తమ అభిరుచికి తగ్గ రంగాల్లో స్థిరపడ్డారు. ఇప్పటి వరకు దాదాపు 10 బ్యాచ్‌ల విద్యార్థులు కోర్సు పూర్తి చేయగా.. మరికొందరు విద్యార్థులు పీజీలు చేస్తున్నారు.



చిత్రాలు గీస్తున్న ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు

■ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ విశ్వవిద్యాలయ ఖ్యాతిని చాటిచెబుతున్నారు. ఇటీవలే రెండుసార్లు సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చాంపియన్‌షిప్ కైవసం



వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు రూపొందించిన ఆర్ట్‌గ్యాలరీ

చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు రాయలసీమ సంస్కృతి, సంప్రదాయాలను క్యాన్వాస్‌లపైకి ఎక్కించడంతో పాటు శిల్పాలు తీర్చిదిద్దుతున్నారు.

**కోర్సు ద్వారా లభించే అవకాశాలు..**

ఈ కోర్సులు చేయడం ద్వారా యానిమేషన్, ఫ్యాషన్, జ్యువెలరీ డిజైనింగ్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా అడ్వర్‌టైజింగ్‌కు ఉన్న డిమాండ్‌ను బట్టి ఆయా ఏజన్సీల్లో సైతం ఉపాధి పొందవచ్చు. ఇంటీరియల్ డిజైనింగ్, ఫర్నీచర్ డిజైనింగ్, పిల్లల బొమ్మల తయారీ రంగాల్లో అవకాశాలు లభిస్తాయి. కార్పొరేట్ స్కూల్స్, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా, ప్రొఫెషనల్ ఆర్టిస్టుల్లా రాణించే అవకాశం ఉంది.

**ప్రవేశాలు ఇలా..**

ఇంటర్మీడియట్, డిప్లొమా పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఎవరైనా 4 సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో ప్రవేశాలు పొందవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు ఓఎండీసీ వెబ్‌సైట్ లేదా వైవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు డా. కోట మృత్యుంజయరావు 94923 45419, వెంకటేష్ 90100 14304 నెంబర్లలో సంప్రదించవచ్చు.

**నైపుణ్యాలను అందిపుచ్చుకునే కోర్సు..**



ఎంతో చక్కటి నైపుణ్యాలను అందిపుచ్చుకునే కోర్సు బీఎఫ్ఏ. బొమ్మలతయారీ వారసత్వం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన నాకు స్వతహాగానే కళల పట్ల అభిరుచి ఉంది. బీఎఫ్ఏలో చేరడం, ఇక్కడ డిజైన్ మీద ప్రతి సెమిస్టర్‌లో పేపర్లు ఉండటం వలన నాకు ఎంతో నేర్చుకునే అవకాశం కలిగింది. ఇటీవలే కోర్సు పూర్తిచేసుకున్న నేను మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నాను. - దీప్తి, బీఎఫ్ఏ పూర్వ విద్యార్థిని, రైల్వేకోడూరు

**ఎన్నో మెలకువలు నేర్చుకునే అవకాశం లభించింది..**



యోగివేమన విశ్వవిద్యాలయంలో 2018–22 బ్యాచ్‌లో బీఎఫ్ఏ పూర్తిచేశాను. కోర్సు చేసే సమయంలో ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. వైవీయూలో చక్కటి వసతులు ఉన్నాయి. అక్కడ నేర్చుకున్న అంశాలు ప్రస్తుతం నేను చేస్తున్న మాస్టర్స్ డిగ్రీలో కూడా ఉపయోగకరంగా ఉన్నాయి. - ఎం. యశస్విని, ఎంఎఫ్ఏ, బెంగళూరు

**కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు..**



విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులందరికీ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరంగా ఉంది. ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ యేడాది నుంచి వైవీయూలోనే మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులు కూడా ప్రారంభించాం. - డాక్టర్ కోట మృత్యుంజయరావు, లలితకళల విభాగాధిపతి, వైవీయూ

## జీవనరాగాలను పలికించిన 'మానస వీణ'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : యువ రచయిత్రి జీఎల్ లావణ్య రచించిన 'మానస వీణ' పుస్తకం జీవన రాగాలను పలికించిందని మాజీ శాసనమండలి సభ్యులు, జమ్మలమడుగు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చదిపిరాళ్ళ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. 'మానస వీణ' కవితా సంపుటి ఆవిష్కరణ సభను బుధవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చదిపిరాళ్ళ నారాయణ రెడ్డి మాట్లాడుతూ లావణ్య వృత్తిరీత్యా న్యాయవాది అయినా కవితా రచనల వైపు వెళ్లడం అభినందనీయమన్నారు. తన కవితల్లో సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనివ్వడం ఆమె సంస్కారాన్ని తెలుపుతోందన్నారు. సభాధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి మాట్లాడుతూ లావణ్య రచనా శైలి సరళమైనదని కొనియాడారు. ఆత్మీయ అతిథి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ లావణ్య స్త్రీల అంతరంగాన్ని చక్కగా ఆవిష్కరించారని అభిప్రాయపడ్డారు. మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరిగోపుల లక్ష్మీనారాయణ పుస్తక పరిచయం చేస్తూ రచయిత్రి భావాలకు ఈ రచన అద్దం పట్టినట్లుగా ఉందన్నారు. రచయిత్రి జీఎల్ లావణ్య తన స్పందనను తెలుపుతూ ఈ రచన తన ఆలోచనలకు ప్రతిరూపమని వివరించారు. వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, అధ్యాపకులు బాలగొండ గంగాధర్ సభను పర్యవేక్షించారు. అనంతరం రచయిత్రి లావణ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి వంశీకృష్ణ, సంజీవరెడ్డి, పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ సులోచనాదేవి, డాక్టర్ పాలెం వేణుగోపాల్, కె.కుమారస్వామి, కొత్తపల్లి రామాంజనేయులు, శ్యామసుందర్ రెడ్డి, భూపతి రాయల్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయ విభాగాల పరిశీలన



జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు బాధ్యతలను చేపట్టిన అనంతరం వివిధ విభాగాలను పరిశీలించారు. ఒక్కో విభాగం పనితీరు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం పరిపాలన విభాగం, అర్మరీ వర్క్‌షాప్, కమ్యూనికేషన్స్ విభాగం, కోర్టు మానిటరింగ్ సెల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంను సందర్శించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**పోలీస్‌స్టేషన్‌లను పరిశీలించిన ఎస్పీ**

కడప నగరంలోని ఒన్‌టౌన్, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, మహిళా పోలీస్‌స్టేషన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లను బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి పోలీసుల పనితీరును సమీక్షించి, బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీడియో వాల్‌ను పరిశీలించారు. కమాండ్ అండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్), డయల్ 100, 112 కాల్స్, నగరంలోని సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు.

■ కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లోని ఫ్యామిలీ కౌన్సిలింగ్ రూమ్‌ను పరిశీలించిన ఎస్పీ పలు సూచనలు చేశారు. స్టేషన్‌లోని పలు రకాల రికార్డులను ఎస్పీ పరిశీలించారు.

■ కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పరిశీలించారు. విజుబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, విస్తృతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రమాకాంత్, కడప ఒన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడికి నివాళి



మాచునూరులో చంద్రారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



చంద్రారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : మండల సీనియర్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి(76) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం స్వగ్రామం మాచునూరులో అంత్యక్రియలు నిర్వహించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమారై డాక్టర్ రమ్యతారెడ్డి, మాజీ హోంమంత్రి మైసూరారెడ్డి తమ్ముడు రమణారెడ్డి, కుమారుడు, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వేంపల్లె సతీష్‌రెడ్డి తనయుడు నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరై నివాళి అర్పించారు.

## రసాయన ఎరువులతో ఆహార ఉత్పత్తులు విషతుల్యం

వేంపల్లె : రైతులు పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం వేంపల్లి మండలంలోని తాళ్లపల్లె, కత్తలూరు గ్రామాల్లో ఆయన ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు.

# కడప రాయుడి సన్నిధిలో ఏకాదశి పూజలు



ఏకాదశి అలంకారంలో శ్రీ లక్ష్మీసత్యనారాయణ స్వామి



దేవుని కడప ఆలయానికి వచ్చిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చక బృందం తెల్లవారుజామునే స్వామికి ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి విశేష అలంకారం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. భక్తులు తొలుత ఆలయ ప్రాంగణంలోని పాదపీఠానికి మొక్కుకుని అనంతరం బలిపీఠం, ఆ తర్వాత దేవతామూర్తుల దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**స్వామి సేవలో నూతన ఎస్పీ**

వైఎస్సార్ జిల్లాకు విచ్చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఇతర పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చక బృందం, ఇన్‌స్పెక్టర్ వారికి సంప్రదాయ పూర్వకంగా స్వాగతం పలికి దర్శనానంతరం విశేష వస్త్ర, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఎస్పీ దంపతులకు వేద ఆశీస్సులు అందజేశారు.

**సత్యదేవుని సన్నిధిలో ఏకాదశి పూజలు**

కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్ భట్టర్ ఉదయం పుణ్యాహవాచనం, గణపతిపూజ, తిరుమంజన అభిషేకం, విశేష అలంకారం నిర్వహించారు. తోమాల సేవ చేసి భక్తులచే సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల అలంకృత ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి సమీప గ్రామాలలో ఊరేగించారు.

**భద్రాద్రి రామాలయంలో..**

కడప నగర పరిధిలోని ఇందిరానగర్‌లోగల శ్రీ భద్రాద్రి రామాలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు పూజోత్సవాలను నిర్వహించారు.

### 21న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

వేముల : మండలంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సాయిబాబా ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని భూమయ్యగారిపల్లెలో భక్తులకు అన్నదానంతోపాటు సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.80వేలు, తృతీయ బహుమతి రూ.60వేలు, నాల్గవ బహుమతి రూ.50వేలు, ఐదవ బహుమతి రూ.40వేలు, ఆరవ బహుమతి రూ.30వేలు, ఏడవ బహుమతి రూ.20వేలు, ఎనిమిదవ బహుమతి రూ.10వేలు చొప్పున అందించనున్నారు. పోటీలలో పాల్గొంటున్న వృషభాలకు కన్సలేషన్ బహుమతులను కూడా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### బీ కేర్ ఫుల్ బ్రదర్



ఒకే స్కూటర్‌పై వెళుతున్న నలుగురు మైనర్ బాలురు

కడప ఎన్‌జీఓ కాలనీలో నలుగురు మైనర్ బాలురు ఒకే స్కూటీపైన వెళుతున్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా.. హెల్మెట్ లేకుండా ఇలా వెళ్లడం ప్రమాదకరం. పోలీసులు, న్యాయశాఖ అధికారులు ఇటీవల ద్విచక్ర వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, రహదారి భద్రతా నియమాలు పాటించాలని, ముఖ్యంగా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అయినా చాలా మంది వారి మాటలు పక్కనబెడుతున్నారు. కనీసం తల్లిదండ్రులైనా తమ పిల్లలు ఎలాంటి పనులు చేస్తున్నారో గమనించాలి. పోలీసులు కూడా ఇలా ప్రమాదకర ప్రయాణాన్ని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలి.

– కడప ఎడ్యుకేషన్

# భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కమలాపురం : విభరాపురంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పెండ్లిమర్రిలో పీర్లను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్తులు



పెద్దపుత్తలో పీర్ల గ్రామోత్సవం

కమలాపురం : మండల ప్రజలు మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బుధవారం పట్టణంలోని కుళాయిస్వామి దర్గాతో పాటు బీడీ కాలనీ, కె.అప్పాయపల్లె, గోపులాపురం, జీవంపేట, విభరాపురం, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, పొడదుర్తి తదితర గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పీర్ల చావిడీల్లో ప్రతిష్టించిన పీర్ల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. భక్తులకు చక్కెర పంచిపెట్టారు. విభరాపురంలో నూతనంగా నిర్మించిన దర్గాలో మహమ్మద్ ప్రవక్త (స.అ.స.) మనుమళ్లు హసేన్, హుసేన్‌ల చిత్ర పటాలతో పాటు పీర్లు ప్రతిష్టించారు. పీర్లను బంగారు నగలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వాటిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అర్ధరాత్రి వరకు పలు గ్రామాల్లో పీర్లను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. పీర్లు తమ ఇండ్ల వద్దకు వచ్చినపుడు భక్తులు ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీర్లను ఎత్తుకొని అగ్ని గుండం ప్రవేశం చేశారు.

**వల్లూరులో..**

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వల్లూరు, పెద్దపుత్త, తప్పెట్ల, దిగువపల్లె తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలను నిర్వహించారు. పీర్ల చావిడి దగ్గర ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. రాత్రి పెద్ద గుండం కాల్చే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

**పెండ్లిమర్రిలో..**

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, వెల్లటూరు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ప్రజలు కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకున్నారు. పీర్లకు ఎదురుగా గుండం ఏర్పాటుచేసి గుండం ప్రవేశం చేశారు. సాయంత్రం బాణా సంచా, డప్పు వాయిద్యాల మధ్య పీర్ల ఊరేగింపు చేశారు.

**వీరపునాయునిపల్లెలో..**

వీరపునాయునిపల్లె: మండలంలోని గంగిరెడ్డిపల్లె, మిట్టపల్లె, ఉరుటూరు గ్రామాల్లో పీర్ల గ్రామోత్సవం బుధవారం వైభవంగా సాగింది. గ్రామోత్సవంలో కుల మతాలకు అతీతంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పీర్లను ఎత్తుకుని గుండప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

**చెన్నూరులో..**

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో పీర్లను పెన్నా నది వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు.